క్లుప్తంగా

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



కార్మికులకు మద్దతు తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్ల ప్రతినిధులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో కార్మికులను అక్రమంగా తొలగించి 78 రోజులు గడచినా, వారిని విధుల్లోకి చేర్చుకోవడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కాంత్రికుమార్ ఆరోపించారు. నెల రోజులుగా ఫ్యాక్టరీ గేటు ఎదురుగా కార్మికులు చేస్తున్న ఆందోళన ఆదివారమూ కొనసాగింది. స్థానిక ఏడీబీ రోడ్డులో కొనసాగుతున్న వీరి ఆందోళనకు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దాపురం ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబి, ఎస్తేర్‌రాణి, నాగమణి, దేవి మాట్లాడారు. కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ మంత్రికి కూడా ఫ్యాక్టరీ అధికారులు అవాస్తవాలు చెబుతున్నారని ఆరోపించారు. కార్మికులు ఆదివారం వాలీబాల్ ఆడుతూ నిరసన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీధర్

సామర్లకోట: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీధర్ వైద్య సేవలు అందించారు. సుమారు 140 మంది పరీక్షలు చేయించుకున్నట్టు సంఘ ప్రతినిధి విప్పర్తి కొండలరావు తెలిపారు. ప్రతి నెలా ఈ వైద్య శిబిరం నిర్వహించాలని సంఘం నిర్ణయించిందన్నారు. సంఘ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది రోగులకు సేవలందించారు.

150 మందికి వైద్య పరీక్షలు



నాగులపల్లిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి శివాలయం వద్ద ఆదివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరో ఎక్సపర్ట్ క్లినిక్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామంలోని 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు జనరల్, బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె, మలేరియ, టైఫాయిడ్, డెంగీ, విషజ్వరాలు, నరాల బలహీనత, కీళ్లనొప్పులు, కామెర్లు, గ్యాస్ట్రబుల్, లివర్, ఆయాసం, ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కోడి పందేలాడుతున్న ముగ్గురి అరెస్టు

కొత్తపల్లి: కోడి పందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రమణక్కపేట శివారు కేఎస్ఈజెడ్ భూముల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కొత్తపల్లి: పిఠాపురం రథాలపేటలోని అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలులో సోమవారం నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జన జాతరకు తరలిన మాదిగ నేతలు

సామర్లకోట: ఈదుమూడిలో నిర్వహిస్తున్న మాదిగ జాతరకు మాదిగ ఐక్యవేదిక నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని ఆధ్వర్యంలో స్థానిక మాదిగ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమం పుట్టిన గడ్డపై ఆదివారం మాదిగ జన జాతర నిర్వహించారు. తరలి వెళ్లిన వారిలో రాష్ట్ర నాయకులు చిడికి స్టాలిన్, నందిక చక్రం, సవరం చిట్టిబాబు, చెవ్వేటి కుమార్, చాపల సురేష్, ప్రమోద్ ఉన్నారు.

కల్వర్టు.. ముప్పుతో కనికట్టు

- ప్రాణాంతకంగా మారిన కల్వర్టులు
- తరుచూ సంభవిస్తున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు



మూడు రోడ్ల కూడలిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా..

సామర్లకోట: ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలదే. కనీస వసతులతో పాటు, ప్రజల ప్రాణానికి రక్షణ, భద్రత ఉండేలా శ్రద్ధ చూపాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వ యంత్రాంగానిది. కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పెద్దలతో పాటు చిన్నారుల ప్రాణాలకూ భద్రత కొరవడింది. పట్టణంలో ఉన్న అనేక కల్వర్టుల దుస్థితి ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది.

మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కూడళ్లలో కల్వర్టులు శిథిలం కావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద కల్వరు శిథిలమైంది. బలుసులపేట, తెలుకులపుంత, వీర్రాఘవపురం, నీలమ్మ చెరువు ప్రాంతాలకు చెందిన వారు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు పొడవునా ధ్వంసం కావడంతో, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కల్వర్టు గోతిలో కూరుకుపోయే అవకాశముంది.

స్కూల్ జోన్ దుస్థితి

ఈ అపాయకర కల్వర్టు సమీపంలోనే తోట గోపాలకృష్ణ హైస్కూల్ ఉండడంతో తరచూ విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులతో పాటు, అనేక మంది రాకపోకలు సాగించే కల్వర్టుపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కల్వర్టు సమీపంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు, అనేక మంది కౌన్సిలర్లు నివసిస్తున్నా.. కల్వర్టుపై కనీస శ్రద్ధ చూపడం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

అక్కడా ఇంతే..

పిఠాపురం రోడ్డులోని పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులోనూ కల్వర్టు శిథిలమైంది. ఇదే రోడ్డులో కాన్వెంట్ ఉండటంతో పిల్లలు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డులో వాహనాలు వచ్చిన సమయాల్లో పిల్లలు శిథిల కల్వర్టులో పడి ప్రమాదాల బారిన పడుతున్నట్టు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. దీనికి తోడు కల్వర్టుకు మరోవైపు ఉన్న విద్యుత్ స్తంభం తీగలు కిందకు ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఏఈ లేకపోవడంతో అభివృద్ధి, మరమ్మతు పనులు జరగడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పాతికేళ్ల క్రితం నిర్మించినవే..

పట్టణ పరిధిలో 55 వరకు కల్వర్టులున్నాయి. వీటిలో 30 కల్వర్టులు దాదాపు పాతికేళ్ల క్రితం నిర్మించినవి. మున్సిపాలిటీలో ఉన్న కల్వర్టుల్లో మొత్తం 18 శిథిలావస్థలో ఉన్నాయి. వీటిలో పది కల్వర్టులకు ఇటీవల మరమ్మతులు చేసి పటిష్టపర్చారు. ప్రస్తుతం నాలుగు కల్వర్టుల మరమ్మతులు జరుగుతున్నాయి. బ్రౌన్‌పేట, బలుసులపేట, అయోధ్య రామపురం, పాత తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో మరో నాలుగు కల్వర్టులు శిథిల స్థితిలో ఉన్నాయి. వీటొ నిర్మాణాలు, మరమ్మతులు చేయాల్సి ఉంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మూడు రోడ్ల కూడలిలో తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద శిథిల కల్వర్టు విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా.. కాలక్షేపం చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

– నమ్మి దుర్గాభవాని, 11వ వార్డు కౌన్సిలర్, సామర్లకోట

ఓవైపు గొయ్యి.. మరోవైపు వైర్లు



పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో ఓవైపు కల్వర్టుకు రంధ్రం పడింది. మరోవైపు విద్యుత్ స్తంభం వైర్లు కిందకు ఉన్నాయి. ఈ రోడ్డులో కాన్వెంట్ పిల్లలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా కల్వర్టుకు మరమ్మతులు చేయించి, వైర్లు చేతికి అందకుండా పైకి ఏర్పాటు చేయాలి.

– మద్దిరాల శివనాగకృష్ణ, ప్రైవేటు విద్యా సంస్థ అధినేత, సామర్లకోట

అజెండాలోకి తీసుకొస్తాం



కల్వర్టుల మరమ్మతులకు సంబంధించి ప్రస్తుత కౌన్సిల్ సమావేశంలోని అజెండాలోకి తీసుకువస్తాం. ఈ మేరకు నిధులు మంజూరు చేసి, కల్వర్టుల నిర్మాణం పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు ఈ కల్వర్టుల విషయం నా దృష్టికి రాలేదు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు గమనించాలి.

– జాస్తి రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయాలి

సామర్లకోట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం జయంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి ప్రదర్శనగా జి.మేడపాడు వెళ్లి, అక్కడ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారని తెలిపారు. అక్కడి నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి, జగనన్న కాలనీలోని కాంస్య విగ్రహాలకు, రాజీవ్ గృహకల్పలోని విగ్రహానికి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తామన్నారు. అక్కడి నుంచి పెద్దాపురం వెళ్లి మున్సిపల్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



విద్యార్థులకు క్రికెట్ బ్యాట్ అందిస్తున్న రాజా

పెద్దాపురం: ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి కనబర్చాలని పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. మండలంలోని మర్లావ గ్రామంలో ఆదివారం సొంత ఖర్చులతో గ్రామానికి చెందిన విద్యార్థులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజా మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ విద్యతో పాటు, క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగర తీరం

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి భారీగా చేరుకున్నారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం తుని సమీపంలోని లోవలో తలుపులమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నా సమయానికి సాగర తీరానికి చేరుకున్నారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



సాగర కెరటాల్లో కేరింతలు కొడుతున్న యువత

సేవల్లో లయన్స్ క్లబ్ అగ్రస్థానం

- క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల



సభలో మాట్లాడుతున్న ఈదల ఈశ్వరకుమార్

సామర్లకోట: పేద ప్రజలకు సేవలందించడంలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అన్నారు. సామర్లకోట–శ్రీభీమేశ్వర లయన్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి స్థానిక నాగార్జున ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్యఅతిథి ఈశ్వరకుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 44 వేల క్లబ్‌ల ద్వారా పేద ప్రజలకు సేవలందిస్తున్నట్టు వివరించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్ఆర్‌వైవీఆర్ ప్రసాద్, కార్యదర్శిగా తుమ్మల సత్యనారాయణ, కోశాధికారిగా బడుగు బాబితో క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి క్లబ్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్టు చెప్పారు. జిల్లా క్లబ్‌ల్లో సామర్లకోట సేవలు అభినందనీయమన్నారు. ఏటా పశువులకు, పెంపుడు కుక్కలకు ఏఆర్ వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. క్లబ్ ఉప గవర్నర్లు వి.కోటేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసు, వివిధ క్లబ్‌ల చైర్మన్లు నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా ఐఐటీ సీటు పొందిన పేద విద్యార్థి నాగం కుమార్‌కు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ అధ్యక్షత వహించారు. జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, రీజనల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి, మాజీ అధ్యక్షులు కర్రి ఆదినారాయణరెడ్డి, గుండు శంకరరావు, మాజేటి కృష్ణ, ఎస్ సత్యనారాయణ, ఎం.విజయ భాస్కరరెడ్డి, మేకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నర్మదేశ్వర నృత్యోత్సవం



నృత్యోత్సవంలో ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

బోట్‌క్లబ్: నృత్యాంజలి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ కాకినాడ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళా మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నృత్యాంజలి నర్మదేశ్వర నృత్యోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. సుమారు 400 మంది కళాకారులు 210కి పైగా నృత్యాంశాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. నృత్యోత్సవాల మూడో రోజు కార్యక్రమాన్ని ఎస్ఆర్ స్కూల్ అధినేత భార్గవి రామకృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు కర్రి ఆదినారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నృత్యాంజలి నిర్వాహకులు హరిలోకేష్ శర్మ, కృష్ణవేణి మాట్లాడుతూ మూడు రోజులుగా చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ప్రముఖులు స్వామి కృష్ణానంద మహరాజ్, వీఎస్ వరప్రసాద్, జోగా వీరవెంకటరమణ యాదవ్, ఎస్ బద్రి, కె.సుబ్బరాజు నృత్యం చేసిన కళాకారులకు సర్టిఫికెట్లు అందించారు.

అంబరాన్నంటిన మరిడమ్మ సంబరం

- ఆలయానికి బారులు తీరిన భక్తులు
- అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం



మరిడమ్మ అమ్మవారు



మరిడమ్మ ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



చేపల వీధి సంబరం

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా తొలి ఆదివారం సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భారీ క్యూ కట్టారు. అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు అన్ని చర్యలు చేపట్టారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. పలు స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఘనంగా చేపల వీధి సంబరం

ప్రతి వారం నిర్వహించే వీధి సంబరాల్లో భాగంగా ఈ వారం స్థానిక చేపల వీధి సంబరం అంబరాన్నంటింది. భారీ సంఖ్యలో భక్తులు వీధి సంబరంలో సందడి చేశారు. కోలాటం, మ్యూజికల్ నైట్, కాళీ వేషాలు, దేవతామూర్తుల వేషధారణలు, భారీ విద్యుద్దీపాలంకరణ మధ్య అత్యంత వైభవంగా సంబరం జరిగింది.

బుద్ధుని మహాస్థూపం సందర్శన



కొడవలిలో బుద్ధుని మహాస్థూపాన్ని దర్శించుకుంటున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీమన్నారాయణ

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఉన్న బుద్ధుని ధాతుగర్భ మహాస్తూపాన్ని ఆదివారం హైకోర్టు సీనియర్ న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ సందర్శించారు. కొడవలి బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి తరపున బౌద్ధక్షేత్ర సంరక్షణ కోసం హైకోర్టులో కేసును శ్రీమన్నారాయణ వాదిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ రక్షిత కట్టడంగా ప్రకటించిన ఏ పురాతన క్షేత్రంలోనూ తవ్వకాలు జరగరాదని, అందుకు విరుద్ధంగా కొడవలి బౌద్ధ క్షేత్రంలో తవ్వకాలు జరిగాయన్నారు. కొడవలి బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి ఇక్కడ తవ్వకాలను నిలిపివేస్తూ స్టే తీసుకువచ్చామని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అతిక్రమించి ఆ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతుందనే విషయం పరిశీలించి, వాస్తవాలను తెలుసుకోవడం కోసం క్షేత్ర పర్యటనకు వచ్చామన్నారు. ప్రధానబౌద్ధ క్షేత్రంలో ఉన్న ధనం దిబ్బ కొండతో పాటు, నామాల కొండ, తురకల కొండ, మైనింగ్ ప్రాంతలను తమ బృందం పరిశీలించిందన్నారు. వాస్తవాలను హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి అధ్యక్షుడు పెయ్యల పావన్ ప్రసాద్, కార్యదర్శి కాశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌గా వాచ్‌చేస్తూ..

- మనిషి కదలికలన్నీ స్మార్ట్ వాచ్‌లో నిక్షిప్తం
- జీవితంలో కీలక పరికరంలా మారుతున్న ఫైనం
- యువతను ఆకట్టుకుంటున్న ఆధునిక గడియారం
- ఆరోగ్యంతో పాటు.. మరెన్నో ఫీచర్లు



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న స్మార్ట్‌వాచ్‌లు

బోట్‌క్లబ్: ఆధునిక మానవుడి కార్యకలాపాలన్నీ సాంకేతికతతో ముడిపడుతున్నాయి. దైనందిన జీవితంలో సాంకేతిక పరికరాలు కీలకంగా మారాయి. ఇప్పుడు గుండె చప్పుడు కూడా లెక్కగట్టి, కళ్ల ముందుంచే స్మార్ట్ వాచ్‌లు కూడా మనిషి బతుకులో భాగమవుతోంది. వాచ్ అంటే పాత కాలంలో టైం కోసమో, తేదీలు తెలియడానికో ఉపయోగించేవారు. నేడు స్మార్ట్‌వాచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్‌లో ఉండే ఫీచర్స్ దాదాపు అన్నీ అందులో ఉండడంతో యువత వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ద్విచక్ర వాహనం, కార్లు నడిపేవారు సెల్‌ఫోన్ మోగితే మాట్లాడడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ స్మార్ట్‌వాచ్‌లో మాట్లాడుకునే ఫీచర్లు ఉండడంతో, ప్రతి ఒక్కరూ వీటిని కొనుగోలు చేసేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.వెయ్యి నుంచి రూ.లక్ష విలువైన స్మార్ట్ వాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. దాదాపు ప్రముఖ కంపెనీలన్నీ స్మార్ట్ వాచీలు విక్రయిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ల లాగే స్మార్ వాచ్‌లు కూడా అవసరమైన ఫ్యాషన్ ఉపకరణాలుగా మారాయి. ఈ వాచ్‌లు వ్యక్తుల రోజువారీ పనులు కూడా సులభతరం చేసే అనేక ఫీచర్లను కలిగి ఉంటున్నాయి. ఆధునాతన ఫీచర్లతో కెమెరా, సిమ్ కార్డ్ ఆప్షన్లు కూడా ఉన్నాయి.

అన్ని దుకాణాల్లో..

కాకినాడ నగరంలో సెల్‌ఫోన్ విక్రయించే ప్రతి దుకాణంలోను ఈ స్మార్ట్ వాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. నగరంలో సుమారు 130 దుకాణాల్లో స్మార్ట్‌వాచ్‌లు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క దుకాణంలో ప్రతి రోజు మూడు నుంచి 4 వాచ్‌లు విక్రయిస్తున్నారు. నగరంలో సుమారు 20కి పైగా పెద్ద షోరూమ్‌లున్నాయి. పెద్ద షోరూమ్‌లో 10 నుంచి 20 వాచ్‌లు విక్రయిస్తున్నారు. మగవారితో పోటీ పడి మరీ ఆడవాళ్లు స్మార్ట్ వాచ్‌లు కొనుగోలు చేస్తున్నారని దుకాణదారులు చెబుతున్నారు.

బ్లూటూత్ ఆప్షన్

స్మార్ట్‌వాచ్‌లో బ్లూటూత్ ఆప్షన్ ఉంటుంది. ఇది గొప్ప కాంబో ఆఫర్. ఈ వాచ్‌ల్లో టూత్ పరికరాలను కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఈ వాచ్ ఉపయోగించి ఫోన్ కాల్స్‌ను స్వీకరించవచ్చు. డయల్ కూడా చేయవచ్చు. మెసేజ్‌లు కూడా పంపించవచ్చు. సోషల్ మీడియా నోటిఫికేషన్లు కూడా పోన్‌లో అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్య పరిరక్షణలో..

నేటి కాలంలో చాలా మంది వ్యక్తులు రోజంతా తమ కంప్యూటర్ల ముందు కూర్చుని పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాంటి సమయాల్లో వ్యక్తి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. స్మార్ట్ వాచ్‌లు ఉంటే వారి కార్యాచరణ, నిద్ర, మంచినీరు తాగడం, ఎక్కువ సేపు కూర్చుని ఉంటే నిలబడాలని సూచించడం విలువైన అంశాలను ఇవి అందిస్తున్నాయి. దీంతో మనం ఏ సమయానికి ఏం చేయాలనే అంశాలపై క్లారిటీ వస్తుంది. శరీర ఉష్ణోగ్రత, హృదయ స్పందన రేటునూ ఇది తనిఖీ చేస్తుంది.

మెరుగైన వ్యాయామానికి..

ఈ స్మార్ట్‌వాచ్‌లు మెరుగైన వ్యాయామం చేసేందుకు దోహదపడుతున్నాయి. ఫిట్‌నెస్ లక్ష్యాలను పర్యవేక్షించడం, ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతున్నాయి. హార్ట్‌బీట్ నోటిఫికేషన్, వ్యాయామం చేస్తున్నప్పుడు తమను తాము ఎక్కువగా శ్రమించడంపై హెచ్చరికలు జారీ చేస్తుంది. ప్రతి రోజు ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నారో తెలుపుతుంది.